## క్లుప్తంగా

### 'స్పందనకు'కు ఎనిమిది అర్జీలు

**తెనాలి:** 'స్పందన'లో ప్రజలు సమర్పించే ఫిర్యాదులను పరిశీలించి నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారులు తెలియజేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందన సమావేశంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం ఎనిమిది అర్జీలు దాఖలైనట్టు తెలియజేశారు. ఆయా విభాగాల అధికారులకు పంపి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు.

### జులై 13న పోస్టల్ సమస్యలపై డాక్ అదాలత్



**తెనాలి:** పోస్టల్ సమస్యలపై జులై నెల 13వ తేదీన ఉదయం 11 గంటలకు విజయవాడలోని పోస్టల్ రీజినల్ కార్యాలయంలో డాక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసూనారెడ్డి సోమవారం తెలియజేశారు. పోస్టల్ సేవలు పొందడంలో ఏవైనా సమస్యలు ఉన్నట్టయితే విజయవాడ గాంధీనగరంలో శాంతి అండ్ ప్రశాంతి థియేటర్ దగ్గర్లోని గాంధీనగరం పోస్టాఫీసు పైభాగంలో గల పోస్ట్‌మాస్టర్ జనరల్, విజయవాడ రీజియన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. స్వయంగా హాజరయేందుకు వీలుపడనివారు జులై 3వ తేదీలోగా తమ ఫిర్యాదులను 'అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్), పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం, విజయవాడ రీజియన్, విజయవాడ-520 003' చిరునామాకు పంపు కోవచ్చని వివరించారు.

### కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలి

**తెనాలిఅర్బన్:** విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోవాలని ఉన్నతి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఎం విజయలక్ష్మి సూచించారు. ఇన్ఫోసిస్ సంస్థ ఆర్థిక సహకారంతో ఎస్ఆర్‌కె అండ్ కేఎస్ఆర్ గుప్తా డిగ్రీ కళాశాలలో సోమవారం కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. నెలరోజులపాటు ఉచిత శిక్షణ తరగతులు జరుగుతాయని ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ తెలిపారు. సమావేశంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### టమాటా లోడు తెస్తానని మోసం

**తెనాలిరూరల్:** టమాటా లోడు తీసుకువస్తానని వ్యాపారిని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు. పట్టణానికి చెందిన పెదబాబు తెనాలి కూరగాయల మార్కెట్ వద్ద కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. చిత్తూరు జిల్లా పలమనేరు నుంచి టమాటా లోడ తెప్పిస్తుంటాడు. ఈ క్రమంలో మండలంలోని పెదరావూరుకు చెందిన రావూరి రాజేష్ టమాటా లోడు తీసుకువస్తానని చెప్పి వెళ్లాడు. పలమనేరులోని వ్యాపారుల వద్ద లోడు తీసుకున్నా తెనాలిలో పెదబాబుకు చేరులేదు. దీంతో అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.


### మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**తెనాలిరూరల్:** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు అరెస్ట్ చేశారు. తెనాలి మండలం ఖాజీపేటలో మద్యం అక్రమ విక్రయాలు జరుగుతున్నాయని తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలంకు సమాచారం వచ్చింది. సిబ్బందితో కలిసి తనిఖీలు చేయగా గ్రామానికి చెందిన సాతురామ్ మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించారు. అతని వద్ద నుంచి 14 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్టు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

### రూ. 9.5 లక్షతో డొంక రోడ్డు నిర్మాణం

**తాడేపల్లి రూరల్ :** ఉండవల్లి దళితవాడ రైతులు రాకపోకలు సాగించేందుకు మరో గ్రావెల్ రోడ్డు నిర్మాణాన్ని సోమవారం ఎంటీఎంసీ అధికారులు చేపట్టారు. ఇటీవల ఎమ్మెల్యే ఆర్కేను ఉండవల్లికి చెందిన రైతులు ఉండవల్లి కరకట్ట వెంబడి పంట పొలాల్లోకి వెళ్లడానికి రోడ్డు నిర్మించాలని కోరారు. దీంతో 650 మీటర్ల పొడవునా ఐదు మీటర్ల వెడల్పున రూ. 9.5 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మరో రెండు, మూడు రోజుల్లో పనుల్ని పూర్తి చేయనున్నట్లు డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

### ఉండవల్లి గుహలను సందర్శించిన క్యాడెట్లు



**తాడేపల్లి రూరల్ :** ఎన్‌సీసీ క్యాడెట్లు సోమవారం ఉండవల్లి గుహల్ని సందర్శించారు. ఈ సందర్భంగా 25వ బెటాలియన్ కల్నల్ సి.ఎస్. సిద్ధు మాట్లాడుతూ ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ ఏపీ 25వ బెటాలియన్ ఆధ్వర్యంలో పంజాబ్, మహారాష్ట్ర, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఏపీలోని కేఎల్, నాగార్జున యూనివర్సిటీలతో పాటు పలు విశ్వవిద్యాలయాలకు చెందిన 600 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు సందర్శించినట్లు వివరించారు. విద్యార్థులకు పర్వతారోహణ, ట్రెక్కింగ్, పరుగు, వక్తృత్వ పోటీల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్ యూనివర్సిటీకి చెందిన ఎన్‌సీసీ క్యాడెట్ యస్విని ఉండవల్లి గుహల చారిత్రక ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్**



వృద్ధురాలికి అందుతున్న సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

**తెనాలిరూరల్:** సంక్షేమంతో పాటు అభివృద్ధి జోడు గుర్రాలుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారధ్యంలోని ప్రభుత్వ పాలన సాగుతోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని వివకుమార్ తెలిపారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు నిర్వహించిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో తొలి రోజు ఎమ్మెల్యే శివకుమార్ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పాలనపై ప్రజల స్పందన తెలుసుకోవడంతో పాటు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, స్థానికంగా ఉన్న గ్రామంలోని సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులను ఇంటింటికీ తీసుకు వెళ్లి ప్రభుత్వం అందించిన పథకాల వివరాలను తెలియజేశారు. కార్యక్రమానికి అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో బుర్రిపాలెం గ్రామంలోని అర్హులైన వారందరికీ రూ. 8.46 కోట్ల రూపాయలను వివిధ సంక్షేమ పథకాల కింద నేరుగా వారి ఖాతాల్లోకి వేసినట్టు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో 516 మందికి పింఛన్‌లు ఇస్తున్నామని, 231 కుటుంబాలకు అమ్మ ఒడి పథకం లబ్ధి చేకూరుతోందని చెప్పారు. 96 మంది విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన అందుతోందని, 135 మందికి వైఎస్సార్ చేయూత, 67 మందికి కాపు నేస్తం, 36 మంది ఆటో డ్రైవర్లకు, 436 రైతు కుటుంబాలకు రైతు భరోసా, 56 మందికి ఈబీసీ నేస్తం కింద లబ్ధి, 817 మంది డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేశామని, 80 మందికి నివేశన స్థలాలు మంజూరు చేసినట్టు వివరించారు. గతంలో ఏ ప్రభుత్వంలోనూ ఇంత పెద్ద ఎత్తున సంక్షేమం అందలేదని చెప్పారు. గత మూడేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో తెనాలి నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధింగా రూ. 1500 కోట్ల లబ్ధిని నియోజకవర్గ ప్రజలకు అందించినట్టు ఎమ్మెల్యే శివకుమార్ తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజా ప్రతినిధులు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి వివరించడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు వారధిగా ఈ కార్యక్రమం ఉందన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందించిన లబ్ధిని వివరిస్తూ ప్రజల అవసరాలను తెలుసుకునేందుకు, అర్హత ఉండి సాంకేతిక, ఇతర కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చేందుకు కార్యక్రమం దోహద పడుతుందన్నారు. అందుకోసమే 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు తెలిపారు. తొలుత సూపర్‌స్టార్ ఘట్టమనేని కృష్ణకు నివాళులర్పించారు. తెనాలిలో ఏర్పాటు చేస్తున్న తెనాలి బండ్‌లో సూపర్‌స్టార్ కృష్ణ విగ్రహం ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాస రావు, వైస్ ఎంపీపీ గోపిశెట్టి రమాదేవి, అడుసుమల్లి శ్రీను, అడుసుమల్లి అజయ్, శాఖమూరు రంగయ్య, రాచపూడి రత్నం, రెల్లి మధు, ప్రేమ్‌కుమార్, లాజర్, మరియదాసు, నాగరాజు తదితరులు ఉన్నారు.

## బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీటీసీ సుందరరావు, వెంకయ్యలు

**తెనాలిటౌన్:** రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలో చైల్డ్‌రైట్స్ అడ్వొకేసీ పౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో బాల కార్మికవ్యతిరేక మాసం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరవు, క్రాఫ్ జిల్లా కో ఆర్డినేటర్ జి.వెంకయ్యలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు బాలలను పనిలో పెట్టడం నేరమని, బాలలందరూ బడికి వెళ్లేలాగా చేయాలని, ప్రతి పాఠశాలలో జగనన్న విద్యాకానుకలు అందిస్తున్నామని తెలిపారు. జూన్ నెలను బాలకార్మిక వ్యతిరేఖ మాసంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పికార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.యామిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, క్రాఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిమెంట్ రోడ్డుకు శంకుస్థాపన



**తెనాలిఅర్బన్:** పట్టణంలోని 38వ వార్డు రజక చెరువు సమీపంలో నూతనంగా నిర్మించనున్న సిమెంట్ రోడ్డుకు మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వచ్చిన రూ.20 లక్షల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు వీర్లపాటి విజయలక్ష్మి, పేరం సంజీవరెడ్డి, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మీరావలి, ఎల్‌బీసీ చిన్న పాల్గొన్నారు.

### కారు తీసుకుని పరార్

**తెనాలిరూరల్:** వితంతువు భర్త స్నేహితుడు ఆమె వద్ద నుంచి కారు తీసుకుని పరారవడంపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు.. పట్టణ ఇస్లాంపేటకు చెందిన మానస భర్త ఇటీవల మృతి చెందాడు. అతనికి ఆప్త మిత్రుడైన మణికంఠ కొద్ది రోజుల క్రితం మానస వద్దకు వచ్చాడు. కారుతో కొద్దిగా పని ఉందని, పని అయిన వెంటనే తీసుకువచ్చి ఇస్తానని చెప్పి వాహనాన్ని తీసుకెళ్లాడు. రోజులు గడుస్తున్నా కారు తీసుకురాకపోవడం, ఫోన్ చేసినా సమాధానం ఇవ్వకపోతుండడంతో మణికంఠపై మానస పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

### టీడీపీ కుయుక్తులతో మందపాడులో దాహార్తి

**మేడికొండూరు:** మండలంలోని మందపాడులో దాహం కేకలు మిన్నంటాయి. ప్రజల అవసరాల రీత్యా రెండు రక్షిత మంచినీటి చెరువులున్నాయి. వాటి అభివృద్ధి పనుల్ని సర్పంచ్ ఆవుల సంజీవ రెడ్డి కొద్ది రోజుల కిందట ప్రారంభించారు. అయితే, అడుగడుగునా సాకులతో గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు అడ్డుకుంటున్నారు. పనులు జరిగితే వైఎస్సార్ సీపీకి మంచి పేరు వస్తుందనే ఉద్దేశంతో ప్రతిపక్ష పార్టీ నాయకులు ఈ దురాగతాలకు ఒడిగడుతున్నారు. దీంతో పనులు ఒక్కసారిగా నిలిచి పోయాయి. రెండు చెరువుల్ని మరమ్మతుల రీత్యా కొంతకాలం నుంచి ఎండబెట్టారు. గ్రామస్తులకు మంచినీటి కొరత సృష్టించి, ఇబ్బందులకు గురిచేసే విష రాజకీయ సంస్కృతి తెదేపా నాయకులు చేయడం తగదంటూ పలువురు మహిళలు సోమవారం బిందెలతో పనులు నిలిచిన చెరువు వద్దకు వచ్చి వినూత్న రీతిలో నిరసన తెలిపారు.

## ఎస్ఆర్ఎం- నిట్టే వర్సిటీల మధ్య ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఎస్ఆర్ఎం, నిట్టే యూనివర్సిటీల రిజిస్ట్రార్లు

**మంగళగిరి:** మంగుళూరులోని నిట్టే (ఎన్ఐటీటీఈ) డీమ్డ్ యూనివర్సిటీతో ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ అవగాహనా ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. బయోలాజికల్ సైన్స్‌లో బోధన, పరిశోధనల్ని విస్తృతంగా అభివృద్ధి పర్చాలనే లక్ష్యంతో రెండు యూనివర్సిటీలు అవగాహనా పత్రాలపై సంతకాలు చేశాయి. మంగుళూరులోని నిట్టే యూనివర్సిటీలో ఈనెల 18న జరిగిన రెండు యూనివర్సిటీల సమావేశంలో ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్. ప్రేమ్‌కుమార్, నిట్టే వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ హర్ష హాలహళ్లిలు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. దీనివల్ల రెండు యూనివర్సిటీల మధ్య పరిశోధనల పరంగా సత్సంబంధాలు పెరగడంతో పాటు విజ్ఞాన మార్పిడి, విద్యాపరమైన నైపుణ్యం అభివృద్ధి జరుగుతుందని నిట్టే యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఎం.ఎస్. మూడితయ్య పేర్కొన్నారు. ఎంవోయూల వల్ల రెండు యూనివర్సిటీల మధ్య బలమైన సృజనాత్మక పరిశోధనలు ఆవిష్కరణకు నోచుకుంటాయని, పరిశోధనా రంగ నిపుణుల సలహాలు, సూచనలు ఎంతో ఉపయుక్తంగా మారతాయని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎస్ఆర్ఎం బయోలాజికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జయశీలన్, నిట్టే యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణకుమార్‌తో పాటు పలువురు పరిశోధనా రంగ నిపుణులు పాల్గొన్నారు.

## పాడుబడిన బావిలోకి దూకి యువకుడి ఆత్మహత్య



గోపాల్ (ఫైల్ )

**మంగళగిరి:** పాడుబడిన బావిలోకి దూకి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కార్పొరేషన్ పరిధి యర్రబాలెం రైస్‌మిల్ వీధిలో చోటు చేసుకుంది. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి యర్రబాలేనికి చెందిన శిఖా శంకరరావు, రాజేశ్వరి దంపతుల మూడో కుమారుడు గోపాల్ (35)కు, గుంటూరుకు చెందిన అనూషకు పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి సాయి, చరణ్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. గోపాల్ కొంతకాలం కిందట సెక్యూరిటీ గార్డుగా పని చేసినా, ప్రస్తుతం తాపీ పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వేసవి ఎండల నేపథ్యంలో కొన్ని రోజులుగా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో ఏమి జరిగిందో తెలియదు గానీ గోపాల్ టవల్ కట్టుకుని ఇంట్లోంచి బయటకు వచ్చే క్రమంలో తండ్రి శంకరరావు అడ్డుకుని గేటు వేశాడు. అయినా గోపాల్ దాన్ని తొలగించి సమీపంలో ఉన్న ఓ పాడు బడిన బావిలోకి దూకేశాడు. కుటుంబ సభ్యులు బిగ్గరగా కేకలు వేయడంతో ఇరుగు పొరుగువారు పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్నా ఎవరూ పాడు బడిన బావిలోకి దిగి గోపాల్‌ను కాపాడే సాహసం చేయలేకపోయారు. సమాచారం అందుకున్న మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతి కిరణ్, అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వరరెడ్డి సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. బావి వినియోగంలో లేకపోవడంతో పాడుబడింది. నీరు సైతం పాచిపట్టి, తీవ్ర దుర్గంధం రావడంతో సిబ్బంది సైతం బావిలోకి దిగే సాహసం చేయలేకపోయారు. తాడేపల్లి సీతానగరంలోని గజ ఈతగాళ్లను రంగంలోకి దించి గోపాల్ మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించినా చీకటి పడటంతో వీలుపడలేదు. మృతదేహం మంగళవారం ఉదయం నీటిపైకి తేలియాడే అవకాశం ఉందని, అప్పటి వరకూ ఏమీ చేయలేమని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మృతుని కుటుంబ సభ్యులకు తెలిపారు.

# విద్యార్థుల భవితకు జగనన్న బాటలు

- ప్రజా ప్రతినిధుల ప్రశంసలు
- పలు పాఠశాలల్లో జగనన్న ఆణిముత్యాలుకు పురస్కారాల ప్రదానం



వడ్డేశ్వరం హైస్కూలులో విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు



ఈమని హైస్కూలులో పురస్కారాల పంపిణీ

**తాడేపల్లి రూరల్ :** మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలోను, దుగ్గిరాల మండలం ఈమని జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం 10వ తరగతిలో మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా అభినందన కార్యక్రమం నిర్వహించారు. తాడేపల్లి వడ్డేశ్వరం జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నాయకులు కత్తిక రాఘవరావు పాల్గొని, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యలో పెను మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని చెప్పారు. అనంతరం పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన అప్పికట్ల ఉదయనాగలక్ష్మికి రూ.3వేలు, ద్వితీయ స్థానం సాధించిన పసుపులేటి జాహ్నవికి రూ. 2వేలు, తృతీయ స్థానం సాధించిన వడ్డేశ్వరం కోమలికి రూ. వెయ్యి అందజేశారు.వైఎస్సార్ సీపీ నాయకులు గొడవర్తి శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. సుబ్బారావు, ఉపాధ్యాయులు పి. బుజ్జిబాబు, కె. కాంతారావు, డి.వి.రవణమ్మ, కె. వెంకటేశ్వరరావు, కె. జోజప్ప, రామచంద్రరావు, సీహెచ్‌వీఆర్ సత్యనారాయణ, టి. శ్రీనివాస రావు, డి. శ్రీనివాసరావు, సాయిబాబు, పి. కోటేశ్వరరావు, బి. శ్రీదేవి, సీహెచ్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**దుగ్గిరాలలో....**

మండల పరిధిలోని ఈమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి దుగ్గిరాల జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ జగనన్న ఆణిముత్యం విద్యార్థులకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ఈమనిలో బాలికల కోసం ఇంటర్మీడియట్ విద్యను ఉచితంగా ప్రభుత్వం ద్వారా ప్రారంభించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రథమ స్థానం సాధించిన పి. నిశ్రియకు రూ.3 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎం. పావనికి రూ.2 వేలు, తృతీయ స్థానం సాధించిన మహిమ క్రాంతికి రూ. వెయ్యిని జగనన్న ఆణిముత్యాలుగా అందించారు. 6వ తరగతి నుంచి 11వ తరగతి వరకు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు రూ. 15వేలను కె. స్వప్న జ్ఞాపకార్థం పూర్వ విద్యార్థి కె. సుబ్రహ్మణ్యం, రోహిణి ఆర్థిక సహకారంతో అందించారు. పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. ఏడుకొండలు , ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాఘవయ్య, ప్రకాశరావు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ బి. కోటయ్య, విద్యా కమిటీ చైర్మన్ బొంతు కోటయ్య, పూర్వ విద్యార్థి అంచె రామమోహన్, ఉపాధ్యాయులు బ్రహ్మేశ్వరరావు, యస్. ప్రకాశరావు, టి. శ్రీనివాసరావు, రాజశేఖర్, తల్లిదండ్రుల కమిటీ పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన 'టీపీఎల్' క్రికెట్ పోటీలు



విజేత రమేష్ సీసీ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

**తెనాలి:** క్రీడాకారులను ప్రోత్సహించేలా తెనాలిలో ఏటా క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణ జయప్రకాష్‌నగర్‌లో గత 23 రోజులుగా జరిగిన తెనాలి ప్రీమియర్ లీగ్ (టీపీఎ) క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. సాయంత్రం జరిగిన ముగింపు సభలో ఎమ్మెల్యే శివకుమార్, టూ టౌన్ సీఐ వెంకట్రావు విజేతలైన జట్లకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలతోపాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.5 వేల బహుమతిని, టీపీఎల్ ట్రోఫీని బహూకరించారు. రమేష్‌సీసీ జట్టు విజేత కాగా, కొరివి సురేష్‌సీసీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. రోషన్ సీసీ జట్టు మూడో బహుమతిని సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని గోపినాయుడు, జ్యోతుల బాబి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతిని గెలుచుకున్నారు. కమిటీ సభ్యులు కనపర్తి జవహర్ కుమార్, నాలాది ప్రభాకర్, వాసిమళ్ల జవహర్ లాల్, జ్యోతుల బాబు, బట్టు ఆదాం, మట్లపూడి రాజేశ్వరరావు, అత్తోట పవన్, శానం కిరణ్‌కుమార్, సతీష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, షేక్ దుబాయ్ బాబు, షేక్ మీరావలి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



ప్రింటర్ బహూకరిస్తున్న పూర్వవిద్యార్థులు

**అన్నవరపు లంక(కొల్లిపర):** పాఠశాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ తోడేటి రాజేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని అన్నవరపు లంక గ్రామంలోని హైస్కూల్లో చదవుకున్న పూర్వవిద్యార్థులు పాఠశాలకు రూ.8 వేల రూపాయాలు విలువ కలిగిన ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మారుమూలన ఉన్న పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకొన్నాక ఆ పాఠశాలను మరిచి పోకుండా గుర్తించుకుని పాఠశాలకు అభివృద్ధి కోసం ఈ విధంగా సహాయ సహకారాలు అందిస్తున్న పూర్వ విద్యార్థుల గొప్పతనం ఎంతో అభినందనీయమన్నారు.ఇలా ప్రతి ఒక్కరూ ఆలోచిస్తూ పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ టి.శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు టి.మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ సువర్ణ లక్ష్మి, మాజీ సర్పంచ్ రాధాకృష్ణమూర్తి, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

## ఆణిముత్యాలుకు ప్రోత్సాహం



**తూములూరు(కొల్లిపర):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహం మిగతా వారిలో స్ఫూర్తి నింపుతుందని తూములూరు గ్రామ ఉపసర్పంచ్ మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ కొండా కిశోర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తూములూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఈదా సాంబిరెడ్డి ఆధ్వర్యంలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన (తమ్మా నీహారిక-580 మార్కులకు రూ.3000 నగదు, గోల్డ్ మెడల్, సర్టిఫికెట్, గోడ్డటి నాగశ్రీ 564 మార్కులకు రూ.2వేలు నగదు, సిల్వర్ మెడల్, సర్టిఫికెట్, పిల్లి కీర్తన 547 మార్కులకు రూ.1000 నగదు, బ్రాంజ్ మెడల్ సర్టిఫికెట్, )లకు జగనన్న ఆణిముత్యాలు పేరిత నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయలు జి.రజినికాంత్‌రెడ్డి, జి.నాగేశ్వరరావు, వై.శ్రీనివాసరావు, వి.సంపన్న, ఎం. సూర్యప్రకాశరావు, రజిని, సౌజన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్ధురాలికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



వృద్ధురాలికి సాయాన్ని అందజేస్తున్న ఎంపీపీ సంతోష రూపవాణి తదితరులు

**తాడేపల్లి రూరల్ :** దుగ్గిరాల మండలంలోని తుమ్మపూడికి చెందిన ఓ వృద్ధురాలికి మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే సోమవారం ఆర్థిక సాయాన్ని ప్రకటించి అందజేయించారు. ఈ సందర్భంగా దుగ్గిరాల ఎంపిపి దానబోయిన సంతోష రూపవాణి మాట్లాడుతూ తుమ్మపూడికి చెందిన వృద్ధురాలు సయ్యద్ నూర్జహాన్ కుమారుడు అంగవైకల్యంతో బాధపడుతున్నాడని, కుమార్తె మతిస్థిమితం లేకపోవడంతో ఇద్దరినీ పోషిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ. 15 వేలను ప్రకటించి అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, బీసీ సెల్ అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, షేక్ బాషా, కుశల ప్రసాద్, కర్రే సుధాకర్, పఠాన్ బాజీ, పోపూరి హృదయరాజు, నల్లమామిడి తిరుమలరావు, చిట్టిబొమ్మ నరేంద్ర పాల్గొన్నారు.

**చిరు వ్యాపారులకు తోపుడు బండ్ల అందజేత**

దుగ్గిరాల మండల పరిధిలోని తుమ్మపూడి గ్రామానికి చెందిన నూతలపాటి సువార్తమ్మ, కొండూరు సుగుణమ్మ, షేక్ ఖలీల్‌లు అద్దె బండ్లపై చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వారికి తోపుడు బండ్లు తయారు చేయించి నాయకుల ద్వారా అందజేయించారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపిపి దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వేలు, సివిల్ వివాదాలకు ప్రతి సోమవారం పరిష్కారం

**తహసీల్దార్ రాంప్రసాద్**

**మంగళగిరి:** మండలంలో భూ సర్వేలు, ఆక్రమణలు, భూ సంబంధ సమస్యల్ని పరిష్కరించేందుకు రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు అధికారులతో కో-ఆర్డినేట్ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జి.వి.రాంప్రసాద్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలు భూమి సర్వేలు, సివిల్ వివాదాలతో ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా ప్రభుత్వం తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు అధికారులతో కో-ఆర్డినేట్ సమావేశం నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. సమావేశంలో పట్టణ, రూరల్ పోలీస్ అధికారులు, సర్వేయర్లు పాల్గొంటారన్నారు. తమ పరిధిలో ఉన్న ప్రజల భూ సమస్యల్ని పరిష్కారంతో పాటు వాటికి సంబంధించిన డాక్యుమెంట్స్‌ను సకాలంలో అందజేస్తామని తెలిపారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

### పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

**మంగళగిరి:** పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కార్పొరేషన్ పరిధి యర్రబాలెం యాదవుల వీధికి చెందిన చిమటా శేషయ్య (47) కుటుంబ కలహాలతో 15 రోజుల కిందట ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడ్ని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడే చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.